సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం। 7 । ఫిబ్రవరి । 2023



స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి

స్పందనలో ఇచ్చే అర్జీల పరిష్కారంపై ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశించారు. అర్జీలపై ఆడిట్ జరుగుతుందన్నారు. -8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.59,260
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,293
3 శాతం జీఎస్టీతో	రూ.5,452
నవర (8 గ్రా)	రూ.43,616

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.9 /22.9

జిల్లా వ్యాప్తంగా మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఉక్కపోత ఉంటుంది. గాలిలో తేమ 67 శాతం ఉంది.

న్యూస్‌రీల్

రిస్క్ ఉంటే ఉచితంగా హెపటైటిస్ వ్యాక్సిన్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, అడిషనల్ డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ తదితరులు

నెల్లూరు(అర్బన్): హెచ్ఐవీ, ఇతర హైరిస్క్ ఉన్న వారందరికీ ఉచితంగా హెపటైటిస్–బి వ్యాక్సిన్ వేస్తామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. అందుకు సంబంధించి వాల్‌పోస్టర్లను స్థానిక సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఏడీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్, ఇతర డాక్టర్లు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ రోజురోజుకు దేశంలో హెపటైటిస్ బాధితులు ఎక్కువవుతున్నారన్నారు. హెపటైటిస్ ఉన్న వారు ముందస్తుగా చికిత్స తీసుకుంటే 90 శాతం మందికి నయం అవుతుందన్నారు. హెపటైటిస్ బి అనేది కాలేయ సంబంధిత వ్యాధి అన్నారు. ఇది సోకిన వ్యక్తి రక్తం, వీర్యం, ఇతర శరీర ద్రవాల ద్వారా ఇతరులకు సోకుతుందన్నారు. సూదులు, సిరంజిలు పంచుకోవడం ద్వారా, తల్లి నుంచి బిడ్డకు వస్తుందన్నారు. ఈ వ్యాధి ఉన్న వారికి లక్షణాలు త్వరగా బయటపడవన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ముందస్తుగా మూడు డోసుల హెపటైటిస్ బి వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి బయటపడొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి వైద్యం షురూ

- తమవంతు సాయంగా కదిలిన మానవత్వం
- సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఎమ్మెల్యే చర్యలు
- ఆరోగ్యశ్రీ ట్రస్ట్ డాక్టర్ సహకారం
- ఆస్పత్రి వైద్యులూ సాయం

సాక్షి ఎఫెక్ట్..

ఉలవపాడు: అరుదైన అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రెండేళ్ల చిన్నారికి వైద్యం ప్రారంభమైంది. వైద్యానికి అవసరమైన ఖర్చులకు దాతలు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఉలవపాడు వరిగిచేను సంఘానికి చెందిన మానికల యశ్వంత్ అభిరామ్‌కు ఊపిరితిత్తులు, గుండె మధ్య చీముగడ్డలు ఏర్పడ్డాయి. ఆపరేషన్ చేసి తీయడానికి రూ.6 లక్షలు అవసరం కావడంతో కూలి పనులతో బతికే ఆ బిడ్డ తల్లిదండ్రుల ఆర్థిక స్థోమతను వివరిస్తూ వైద్యానికి సాయం అందించాలని 'సాక్షి'లో సోమవరం 'చిన్నారికి పెద్ద జబ్బు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి పలువురు మానవతావాదులు, దాతలు స్పందించారు. సోమవారం సాయంత్రానికి రూ.41 వేలు సాయం అందింది. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి ఆ బిడ్డ వైద్యానికి అవసరమైన మొత్తాన్ని సీఎం సహాయనిధి నుంచి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు తరఫున ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్‌బాబు బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. విజయవాడలోని వైద్యశాల వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆరోగ్యశ్రీలో ఈ ఆపరేషన్ లేదని అక్కడి వైద్యులు సతీష్‌బాబుకు తెలిపారు. తమవంతుగా కూడా సాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సోమశిలలో 67.174 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 67.174 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,390 క్యూసెక్కుల వరద వస్తోంది. జలాశయం నుంచి పెన్నార్‌డెల్టాకు 3,920, ఉత్తరకాలువకు 730, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సగటున 302 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

ధరాశలు

మార్కెటింగ్‌కు సిద్ధమైన పొగాకు



కర్ణాటకలో ఈ ఏడాది ప్రథమార్థంతో పొగాకు విక్రయ వేలం ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. రాష్ట్రంలో ఈ నెలాఖరు నుంచి వేలం ప్రక్రియ ప్రారంభం కానుంది. అయితే జిల్లాలో రెండో దశలో వేలం ప్రారంభించేందుకు పొగాకు బోర్డు అధికారులు ప్రణాళికలు ప్రకటించారు. కర్ణాటకలో ఈ ఏడాది పొగాకు వేలం ధరలు రికార్డు స్థాయిలో పలికాయి. ఇక్కడా అదే ధరలు లభిస్తాయని రైతులు భారీ ఆశలు పెట్టుకున్నారు. పొగాకుకు అంతర్జాతీయ స్థాయిలో ఏర్పడిన డిమాండ్, గత ఏడాది లభించిన ఆశాజనకమైన ధరలను దృష్టిలో పెట్టుకుని ఈ సారి భారీ స్థాయిలో సాగు చేపట్టారు.

- కర్ణాటక మార్కెట్లో ఈ ఏడాది రికార్డు స్థాయిలో కిలోకు రూ.274 ధర
- ఈ నెలాఖరు నుంచి రాష్ట్రంలో వేలం ప్రారంభించేలా షెడ్యూల్ విడుదల
- జిల్లాలో రెండో దశలో పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభం
- అదే స్థాయిలో ధరలు వస్తాయని భారీ ఆశలతో రైతులు
- ఈ ఏడాది భారీగా పెరిగిన పొగాకు సాగు

కందుకూరు : ప్రకృతి విపత్తులకు ఎదురొడ్డి.. ఆదిలోనే నష్టాలను మూటగట్టుకున్నా.. మొక్కవోని ధైర్యంతో సాగు చేసిన పొగాకు అంచనాలకు మించి ఉత్పత్తి రానుంది. అయితే ఆశించిన ధరలు లభిస్తే రైతుల పంట పండినట్లే. గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం చొరవతో పొగాకు ధరలు ఆశించిన స్థాయిలో లభిస్తున్నాయి. తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు విపరీత డిమాండ్ ఏర్పడడంతో పక్క రాష్ట్రం కర్ణాటకలో కొనసాగుతున్న పొగాకు అమ్మకాల్లో కిలో పొగాకుకు రికార్డు స్థాయి ధరలు లభించాయి. ఈ పరిణామాలు జిల్లా రైతుల్లో ఉత్సాహం నింపింది.

2022–23 సీజన్‌కు సంబంధించి రైతులు భారీ అంచనాలతో పొగాకు సాగు చేశారు. పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధిక విస్తీర్ణంలో సాగు చేపట్టారు. సాగు విస్తీర్ణంతో పాటు దిగుబడి కూడా గణనీయంగా పెరగడంతో బోర్డు అనుమతికి మించి ఉత్పత్తి రావచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్‌లో 11 వేలం కేంద్రాలు ఉన్నాయి. వీటిలో తేలిక నేలల పరిధిలో (ఎస్ఎల్ఎస్) జిల్లాలో కందుకూరు–1, కందుకూరు–2, కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాలతో పాటు ప్రకాశం జిల్లాలోని పొదిలి, కనిగిరి వేలం కేంద్రాలు ఉన్నాయి. నల్లరేగడి నేలల (ఎస్‌బీఎస్) పరిధిలో ప్రకాశం జిల్లాలోని వెల్లంపల్లి, ఒంగోలు–1, ఒంగోలు–2, టంగుటూరు, కొండెపి వేలం కేంద్రాలున్నాయి. గత సీజన్‌లో బోర్డు అనుమతి ఇచ్చిన దానికంటే తక్కువగా సాగు చేసిన రైతులు ఈ దఫా అనుమతికి మించి సాగు చేపట్టారు. గతేడాది వేలంలో పొగాకు మంచి ధరలు రావడం, ఈ ఏడాది కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో అధిక శాతం మంది రైతులు పొగాకు సాగు వైపు మొగ్గు చూపారు. డిసెంబర్‌లో మాండూస్ తుఫాన్ ప్రభావంగా ఆదిలో మొక్క దశలోనే నష్టపోయినా రైతులు తిరిగి పొగాకు పంటను సాగు చేశారు. జనవరి చివరి వరకు ఈ ఏడాది పొగాకు రైతులు సాగు చేస్తూనే ఉన్నారు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదు. దీని వల్ల ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పొగాకు పంట సాగైందని అధికారులు చెబుతున్నారు.

ఈ నెలాఖరు నుంచి వేలం ప్రారంభం

పక్క రాష్ట్రం కర్ణాటకలో పొగాకు వేలం చివరి దశకు చేరిన నేపథ్యంలో ఈ నెలాఖరు నుంచి జిల్లాలో పొగాకు వేలం ప్రారంభించేందుకు బోర్డు అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. ఫిబ్రవరి 23న మొదటి దశలో ఒంగోలు, పొదిలి, కొండెపి, వెల్లంపల్లి వేలం కేంద్రాల్లో, మార్చి 9న జిల్లాలోని కందుకూరు–1, 2 కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాలతో పాటు ప్రకాశం జిల్లాలోని కనిగిరి, ఒంగోలు, టంగుటూరు కేంద్రాల్లో వేలం ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ధరలపై రైతులు భారీ ఆశలు పెట్టుకున్నారు. కర్ణాటకలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో కిలో పొగాకు రూ.274 ధర లభించింది. ఇక్కడ గతేడాది కిలో పొగాకు అత్యధిక ధర రూ.184 వచ్చింది. సగటు ధర అత్యధికంగా రీజియన్ పరిధిలో రూ.172 వరకు వచ్చింది. కర్ణాటక మార్కెట్‌లో ఒక్కసారిగా రికార్డు స్థాయిలో ధరలు రావడంతో ఆదే స్థాయిలో ఇక్కడ కూడా రేట్లు ఉంటాయనే ఆశలు అయితే రైతులు పెట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ నెలాఖరు నుంచి ప్రారంభం కానున్న పొగాకు వేలంలో రైతుల ఆశలు నెరవేరుతాయని ఆశిస్తున్నారు.

అధిక విస్తీర్ణంలో పంట సాగు

సీజన్	సాగు అనుమతి (హెక్టార్లలో)	సాగు (హెక్టార్లలో)
2022-23	57,744	61,639
2021-22	49,889.15	46,647.01

99 మిలియన్ కేజీల ఉత్పత్తి అంచనా

పంట సాగు విస్తీర్ణం పెరగడంతో ఉత్పత్తి కూడా పెరుగుతుందని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. బోర్డు 11 వేలం కేంద్రాల పరిధిలో 87 మిలియన్ కేజీల పొగాకును విక్రయించుకునేందుకు అనుమతించింది. కానీ అనుమతికి మించి 12 మిలియన్ కేజీలు అధికంగా అంటే 99 మిలియన్ కేజీల ఉత్పత్తి వస్తుందని బోర్డు అధికారులు అంచనా. ఈ ఏడాది క్యూరింగ్‌లో క్వాలిటీ కూడా పర్వాలేదని చెబున్నారు. 55–60 శాతం వరకు బ్రైట్ గ్రేడ్ (గ్రేడ్–1) పొగాకు వస్తుందని, 25 శాతం మీడియం, మరో 25 శాతం లోగ్రేడ్ నాణ్యత పొగాకు వస్తుందని భావిస్తున్నారు.



పొగాకు పంట

మళ్లీ మళ్లీ తప్పులు చేయొద్దు

- సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాసులునాయక్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాసులు నాయక్

వెంకటాచలం: జైలు జీవితం గడిపి బయటకు వెళ్లిన తర్వాత చేసిన తప్పులు మళ్లీ మళ్లీ చేయొద్దని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసులునాయక్ సూచించారు. మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులు గురించి జడ్జి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జైలు జీవితం పూర్తయి, బయటకు వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. క్షణికావేశానికి గురై వివాదాల్లో తలదూర్చవద్దన్నారు. ఈ సదస్సు లో జైలు సూపరింటెండెంట్ కె.రాజేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ కాంతరాజ్, జైలర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలం తీరిన వాహనాలకు ఈ-వేలం

నెల్లూరు (అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జీవిత కాలపరిమితి దాటి నిరుపయోగంగా ఉన్న 23 వాహనాలను స్క్రాప్ (తుక్కు) కింద విక్రయించేందుకు ఈ–వేలం నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం నిర్వహిస్తామన్నారు. గుర్తింపు పొందిన పాట దారులు హెచ్‌టీటీపీ://కొనుగోలు.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో సంప్రదించి కనీస రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

ఛీ..ధర్‌రెడ్డి దరిద్రం వదిలింది



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో మంత్రి కాకాణి, బాలినేనే, వేమిరెడ్డి, అనిల్, మేకపాటి

- వైఎస్సార్‌సీపీ భిక్షతో గెలిచి పార్టీపైనే నిందలా
- రూరల్‌లో రౌడీయిజం చేస్తే ఉక్కుపాదంతో తొక్కేస్తాం
- ఇకపై రూరల్ ప్రజలు స్వేచ్ఛగా జీవించవచ్చు
- కార్పొరేటర్లు, ప్రజలకు అండగా తాము ఎల్లప్పుడూ ఉంటాం
- బాలినేని, కాకాణి, ఆదాల స్పష్టం

నెల్లూరు (సెంట్రల్): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి, రూరల్ ప్రజలకు పట్టిన ఛీ.. ధర్‌రెడ్డి అనే దరిద్రం వదిలిపోయిందని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్, మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పెట్టిన రాజకీయ భిక్షతో గెలిచి అదే పార్టీపై నిందలు వేయడం సిగ్గు చేటుగా లేదా అన్నారు. తెలుగుదేశం పార్టీకి అమ్ముడుపోయి ఆ పార్టీ అధినేత డైరెక్షన్‌లో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఒక ఎమ్మెల్యే పోయినంత మాత్రనా రూరల్‌లో మేమంతా వైఎస్సార్‌సీపీలో, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉంటామని ఈ రోజు ర్యాలీలో పాల్గొన్న ప్రజాభిమానమే నిదర్శమన్నారు. పార్టీ నుంచి దరిద్రం పోయిందనుకుంటామన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ, ఆ తర్వాత వైఎస్సార్‌సీపీకి జిల్లా మొత్తం కంచుకోటగా ఉంటుందన్నారు.

ఓటు బ్యాంకు చెదరదు

పార్టీ నుంచి ఎవరు పోయినా వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకు మాత్రం చెక్కు చెదరకుండా ఉందనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని రీజనల్ కో–ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాతో గెలిచామనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్‌లోనే కాకుండా జిల్లాలో అందరికీ సుపరిచితుడన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కూడా తన రాజకీయ భవిష్యత్‌ను తేల్చుకోవాలన్నారు.

రౌడీయిజం చేస్తే ఉక్కుపాదంతో అణిచేస్తా

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎవరైనా రౌడీయిజం చేస్తూ వ్యాపారుల వద్ద, రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద డబ్బులు వసూలు చేసే పద్ధతులు మానుకోవాలని ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ రోజు నుంచి ఎక్కడైనా అటువంటి ఘటనలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే ఉక్కుపాదంతో అణిచేస్తానని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఆయా వ్యాపారాలు స్వేచ్ఛగా చేసుకోవచ్చని, ఎవరైనా ఇబ్బందులు పెడితే తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలబడిన ప్రతి ఒక్క కార్పొరేటర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రూరల్ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఎక్కడైనా సమస్య ఉందంటే తమ దృష్టికి తెస్తే తక్షణమే స్పందిస్తామన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోటలాగా ఉందన్నారు.

ఈ ర్యాలీనే ఉదాహరణ

నెల్లూరురూరల్‌లో వైఎస్సార్‌సీపీ ఎంత బలంగా ఉందో స్వాగత ర్యాలీనే ఉదాహరణ అని నగర ఎమ్మెల్యే పి అనిల్‌కుమార్ అన్నారు. మాజీ డీసీసీబీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రూరల్‌లో అందరం కష్టపడ్డాం కాబట్టే ఆయన గెలిచారని, ఈ రోజు పార్టీపై విమర్శలు చేయడం ద్రోహం అన్నారు. కార్పొరేటర్ మొయిళ్ల గౌరీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో సైనికుల మాదిరి పని చేస్తామని, తిరిగి ఆదాలను గెలిపించుకుంటామన్నారు. బొబ్బల శ్రీనివాస్ మాట్లాడుతూ తాము ఈ రోజు నుంచి బానిస సంకెళ్ల నుంచి విముక్తి పొందామన్నారు. రూరల్ ఎమ్మెల్యే వద్ద బానిస బతుకు బతికామన్నారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి వద్ద ఎంతో స్వేచ్ఛగా, హుందాగా ఉంటామన్నారు.

ముఖ హాజరు పాటించకపోతే చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

- కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు (అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు చాలా మంది ముఖ హాజరుకు సంబందించి తమ పేర్లు నమోదు చేసుకోలేదని, కొంత మంది తమ పేర్లు నమోదు చేసుకున్నా సరిగా ముఖ హాజరు వినియోగించడం లేదని, అలాంటి వారిపై చర్యలు తప్పని కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు హెచ్చరించారు. సోమవారం స్పందన కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ కలెక్టరేట్‌లోని తిక్కనప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇకమీదట ప్రభుత్వ అధికారులు 100 శాతం ముఖ హాజరు తప్పనిసరి అని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల పరిధిలో 1,644 కోర్టు పిటిషన్లు, 307 కోర్టు ధిక్కారణ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కోర్టు కేసుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి శనివారం గృహ నిర్మాణ దినంగా పరిగణించి జగనన్న లే అవుట్లలో ఇళ్లను సత్వరమే ప్రత్యేకాధికారులు పూర్తి చేసేలా కృషి చేయాలని సూచించారు.

20న సీఎం వైఎస్ జగన్ రాక

ఈ నెల 20న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలి పట్టణానికి రానున్నారని కలెక్టర్ తెలిపారు. ఆ రోజున చుక్కల భూములు, రీసర్వే కార్యక్రమానికి సంబంధించి వివరాలు తెలియజేసేలా ప్రత్యేక ప్రదర్శన శాలలు ఏర్పాటు చేయాలన్నారు. రహదారులు, పంచాయతీరాజ్‌శాఖల పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

ఆదాల ఎంట్రీ అదుర్స్

- స్వచ్ఛందంగా కదలివచ్చి మద్దతిచ్చిన రూరల్ ప్రజానీకం
- అడుగడుగునా అపూర్వ స్వాగతం
- వైఎస్సార్‌సీపీకి కుంచుకోటగా నిరూపణ

నెల్లూరు (సెంట్రల్): నెల్లూరురూరల్ నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తొలి రోజు ఎంట్రీ అదిరింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం కంచుకోటగా ఉందని సోమవారం జరిగిన ర్యాలీతో మరోసారి స్పష్టమైంది. ఇటీవల జరిగిన రాజకీయ పరిణమాల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తనస్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీపై, అధిష్టానంపై తప్పుడు ఆరోపణలు చేయడంతో తనకు తానుగా నిష్క్రమించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నియమించారు. అనంతరం మొదటిసారిగా నెల్లూరు రూరల్‌లో అడుగు పెట్టిన ఆదాలకు మునుపెన్నడూ చూసీ కనీ ఎరుగని రీతిలో భారీగా తరలివచ్చిన రూరల్ ప్రజానీకం, వైఎస్సార్‌సీపీ అభిమానులు, ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మరొక రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు.

వందలాది వాహనాలతో ర్యాలీ

అయ్యప్పగుడి నుంచి సాగిన ర్యాలీలో స్వచ్ఛందంగా వందలాది వాహనాలు ర్యాలీలో పాల్గొనడం విశేషం. ప్రతి ప్రాంతంలో గజమాలతో స్థానిక కార్పొరేటర్‌లు స్వాగతాలు పలికారు. అయ్యప్పగుడి నుంచి అశేష జనవాహిని మధ్య మినీబైపాస్ వరకు సాగిన ర్యాలీకి దాదాపుగా 3 గంటల సేపు పట్టింది. ఆదాల ర్యాలీలో పాల్గొన్న జనాలు చూసిన ప్రతి ఒక్కరూ నెల్లూరు రూరల్‌లో వైఎస్సార్‌సీపీ కంచుకోట అంటూ మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పి.రూప్‌కుమార్, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, వైపీ రామిరెడ్డి కార్పొరేటర్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భారీ ర్యాలీలో అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న ఆదాల, మంత్రి కాకాణి

టూరిజం ప్రాజెక్ట్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యం

- చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారి శ్రీనివాసులురెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న సీసీఎఫ్ శ్రీనివాసులురెడ్డి

ఉదయగిరి: రాష్ట్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో దాతల సహకారంతో టూరిజం ప్రాజెక్ట్‌ల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు గుంటూరు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం ఉదయగిరి అటవీశాఖ రేంజ్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎకో ప్రాజెక్ట్‌ల వల్ల అడవుల సంరక్షణతో పాటు ఆదాయం, ప్రకృతి ఆహ్లాదం చేకూరుతుందన్నారు. జాతీయ రహదారుల సమీపంలో సందర్శకుల తాకిడి అధికంగా ఉండే అటవీ ప్రాంతాల్లో ఈ ప్రాజెక్ట్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. నెల్లూరు జిల్లాలో పది ఎకో ప్రాజెక్ట్‌లను రూ.29 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని అడవులు అగ్నికి ఆహుతి కాకుండా అటవీశాఖ ద్వారా పల్లెనిద్ర కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. అడవులకు నిప్పు పెట్టే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. తమిళనాడు కూలీలపై ప్రత్యేక దృష్టి సారించి వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా స్మగ్లర్లు ప్రవేశించారని సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. వారికి రివార్డులు అందిస్తామన్నారు. స్మగ్లర్లు అటవీ ప్రాంతంలో సేద దీరే ప్రాంతాలు, నీరు దొరికే ప్రాంతాల్లో వారి ప్రతి కదలికలను డ్రోన్ ద్వారా పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో కొత్తగా 250 హెక్టార్లలో ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తుండగా 3 వేల హెక్టార్లలో నిర్వహణ పనులు చేపడుతున్నామన్నారు. అడవులు వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌ఓ చంద్రశేఖర్, స్క్వాడ్ డీఎఫ్‌ఓ మారుతిప్రసాదరావు, రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ

కొడవలూరు: మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు రగ్బీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. హెచ్‌ఎం జి.శ్రీనివాసులు, పీడీ శివనాగబాబు, కోచ్ వంశీ సోమవారం స్కూల్లో వివరాలు వెల్లడించారు. గత నెల 29 నుంచి 31వ తేదీ వరకు కర్నూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు జరిగాయి. ఇందులో అండర్-17 బాలుర విభాగంలో ఆ స్కూల్ విద్యార్థులు వేణు, జ్ఞానేష్‌కుమార్, ఎస్‌కే షరీఫ్ జిల్లా జట్టు తరఫున పాల్గొన్నారు. ఈ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. అదేవిధంగా ఇక్కడ గత నెల 31 నుంచి ఈనెల 2వ తేదీ వరకూ జరిగిన రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. అండర్-14 బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన జోయల్, మోక్షజ్ఞ, కుమార్ శంకర్, దిలీప్, జితేంద్ర, సాయిమహంత్ పాల్గొని ప్రతిభ చూపారు. వారిని ప్రత్యేకంగా హెచ్‌ఎం తదితరులు అభినందించారు.


పోటీల్లో పాల్గొన్న వారితో హెచ్‌ఎం తదితరులు

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి

• కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): 'స్పందన కార్యక్రమంలో వచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలి. నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి.' అని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో విచ్చేసి వినతులను కలెక్టర్, జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ తదితరులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంతమంది జిల్లా అధికారులు వారికి వచ్చిన అర్జీలను చూడటం లేదన్నారు. ఇది సరైన పద్ధతి కాదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏ మేరకు అర్జీలను పరిశీలించి, సమస్యను పరిష్కరించారో తెలుసుకునేందుకు జిల్లా ఆడిట్ బృందం పని చేస్తోందన్నారు. వారు ప్రతి వారం ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారన్నారు. అందువల్ల అధికారులు అప్రమత్తంగా ఉండి వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సహచరులకు హోంగార్డుల చేయూత

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో మృతిచెందిన, పదవీ విరమణ పొందిన హోంగార్డులకు ఆర్థిక చేయూతనందించేందుకు సహచర హోంగార్డులు ముందుకొచ్చారు. తమ ఒకరోజు వేతనాన్ని అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కుల రూపంలో సోమవారం ఎస్పీ సీహెచ్ విజయారావు నెల్లూరులోని తన కార్యాలయంలో పంపిణీ చేశారు. బిట్రగుంట స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన హోంగార్డు ఆర్.శ్రీనివాసులుకు సంబంధించి ఆయన భార్య తిరుపతమ్మకు రూ.4,29,565, వేదాయపాళెం పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన సీహెచ్ మునికాంతమ్మకు రూ 4,27,435, వెల్ఫేర్ విభాగంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన డి. సత్యనారాయణకు రూ.4,27,435 అందజేశారు. పదవీ విరమణ పొందిన వారు శేష జీవితం హాయిగా గడపాలన్నారు. వ్యాయామాలు చేసుకుంటూ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. సహచరులకు ఆర్థికంగా చేయూతనందించిన జిల్లా హోంగార్డులను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ చంద్రమోహన్ పాల్గొన్నారు.


మునికాంతమ్మకు నగదు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

పొదలకూరు
నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.32
సన్నవి	: రూ.22
పండ్లు	: రూ.8

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 100
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 180
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 200
లేయర్ చికెన్	: 136